# అతడూ — ఆమె



అప్పుడే వర్షం వచ్చి వెలిసింది. మబ్బులు కొంచెం కొంచెంగా విచ్చి తేలిపోయాయి. చంద్రుడు తెల్లగా వెలుగుతున్నాడు. చుట్టూ నక్షత్రాలు మినుకు మినుకుమంటున్నాయి వర్షంనీరు బండరాళ్ళసందుల్లోనుండి జారి కాలవ నీళ్ళల్లో పడతోంది. ఎవరో ఒకతను కాలవగట్టుమీద నుంచొని పాము మెలికల్లా వంకరటింకర్లు తిరిగిన కాలవ కేసి చూస్తున్నాడు.

మనిషి చుట్టూ రావిచెట్టునీడలు — నీడల్లో మధ్యమధ్య ఆకులసందుల్లోంచి సన్నని వెన్నెల వెలుతురు చారలు పడుతున్నాయి. అతనిపై మీది తెల్లని కండువ గాలికి రెపరెపలాడుతు వెనక్కు ఎగురుతోంది. చేతికర్ర ముందుంచి, దాని మీద అని ఎదురుగా పరుగెత్తిపోతున్న కాలువను, ఎత్తయిన దాని ఆవలిగట్టును, గట్టుమీదనుండి కాలువ నీళ్ళల్లోకి వంగిన రావిచెట్టును దాని పరిసరాల్ని చూస్తున్నాడు.

ఏదీ?

అదే! ఆ గట్టుమీద పాక,

ఆ పాకలోని ఆమె.

ఆ పాక ఎండకుఎండి, వర్షానికి తడిసి ఆకులు ఊడిపోగా శిథిలమై ఓనాడు కాలవనీళ్ళల్లో కలిసిపోయింది!

ఆమె కష్టాల్ని సుఖాల్ని తట్టుకుంటూ మనిషి నిలువునా జీర్ణించి, పళ్ళూడి, తలపండి, చూపు కనుపించని స్థితిలో కాలవాహినిలో కలిసిపోయింది!

అక్కడ ఉన్నదల్లా ఒకటి.

ఆమె నాటిన రావిచెట్టు.

ఆమె పోయినా అది చిలవల్నీ, పలవల్నీ, వేసుకొంటూ ఆవలిగట్టునుండి యీావలివరకు విస్తృతంగ వ్యాపించి ఆమెను జ్ఞాపకం చేస్తూ నిలచిఉంది !

* * *

అతను ఊరిప్రక్కనే ఆనుకొనిపోతున్న కాలవగట్టుమీాద రోజూ సాయంకాలం అరమైలు దూరం నడిచివెళ్ళి ఒకచోట కూర్చునేవాడు. అటువైపు ఎక్కువగా జనసంచారం ఉండదు. నేలంతా పచ్చగడ్డి మొలిచి దుప్పటిలా పరుచుకొని ఉంటుంది. మైదానానికి అటూయిటూ అంతులేని పొలాలు. చల్లని గాలులు అప్రదేశాన్ని చుట్టి ఎప్పుడూ వీస్తూనేఉంటాయి. ఆగాలుల్లో పొలాలు తలలూపి అటూ యిటూ ఊగి మెల్లగ శబ్దంచేస్తుంటాయి. అది చక్కటి వాతావరణం. ఆ వాతావరణంలో నిశ్చలత ఉంది. దానిలో అందం ఉంది. నిశ్శబ్దం లోంచి ఊడిపడ్డ పొలాల శబ్దంలో ఒకమాధుర్యంఉంది. దాన్ని అర్థంచేసుకోవడానికి సున్నితమయిన హృదయంకావాలి.

అతను రోజూ అక్కడకు వచ్చేవాడు. చీకటి పడేవరకు ఏదో వ్రాసుకొంటుండేవాడు. ఆ ప్రశాంత తను అతను పూర్తిగా ప్రేమించాడు. అప్పుడప్పుడు వ్రాస్తూ తలపైకెత్తి కాలవనీళ్ళను, 'చుయ్' మని కోసుకొంటూ ఎగువకు దిగువకు వెళ్ళే పడవలను, అందంగ ఎగిరే తెరచాపలను, పడవలమీాది సరంగుల పాటలను వింటూండేవాడు. క్రమక్రమంగ చీకటి

ఆవరించుకొచ్చేది. అంతవరకు తను వ్రాసినవాటిని ఒక మారు చదువుకొనేవాడు.

ఆ ఎదురుగా అవతలి గట్టుమీద సగంభాగం చెట్లమధ్య దాక్కొని చిన్న పూరిపాక ఉంది. చీకటి పడగానే అయింట్లో చిన్న దీపం మినుకుమినుకు మంటుంది. ఆదీపం వెలుతురు కిటికీ గుండా అతనిమీద పడుతుంది; అల్లాపడగానే అతను ఆలో చనల్ని కట్టిపెట్టి వ్రాసిన కాగితాల్ని చుట్టచుట్టి యింటికి వెళ్ళిపోయేవాడు.

సరిగ్గా అతను అక్కడ వ్రాసుకొంటుండే సమయానికే పదహారేళ్ళ అమ్మాయి ఆవలిగట్టున నీళ్ళను ముంచుకొని గట్టెక్కి పాకలోకి వెళ్ళిపోతుంటుంది.

అతను రోజూ ఆమె నీళ్ళను పట్టుకెళ్ళడం చూస్తూంటాడు. ఆమెరోజూ అతను గట్టుమీద కూర్చొని ఏదో వ్రాస్తూండడం చూస్తూంటుంది. ఆమె ఎవరో అతనికి, అతనెవరో ఆమెకు తెలియవు.

అతనెప్పుడూ ఆమెతో మాట్లాడలేదు. ఆమె ఎప్పుడూ అతన్ని పలకరించలేదు. కాని ఆమె ఫలానా సమయానికి కాలవకు నీళ్ళకొస్తుందని, అతను ఫలానా సమయానికి అక్కడకు వస్తాడని వాళ్ళిద్దరకు తెలుసు. అంతకుతప్ప వాళ్ళిద్దరి మధ్యా ఏపరిచయమూలేదు.

ఎప్పుడూ అతను ఆమెను, ఆమె అతన్ని చూసి నవ్వుకోలేదు. కంటిచూపుల్తో, ప్రేమల్తో మాట్లాడుకోలేదు. కాని అతను ఎంతదూరంలో ఉన్నా 'ఫలానా' అని చెప్పగలదు

ఆమె. అతనుకూడా అంతే! ఆమె ఎంతమందిలోఉన్నా 'ఫలానా' అని చెప్పగలడు.

ఆమె కడవను ముంచుతోన్నప్పుడు బుడబుడ మని నీళ్ళు శబ్ధంచేసి అతని ధ్యాసను చెరిపి అతని పనికి ఆటంకం కలిగిస్తుందేమోనని చాలా మెల్లగ నీళ్ళను కడవలోకెత్తి, ఆకడవను భుజాని కెత్తుకొని వెళ్ళిపోతూ ఒకమారు వెనక్కు తిరిగి అతన్ని చూస్తుంది.

అతను వ్రాసుకొంటూ సన్నని గాజులు గలగలలాడుతూంటే వ్రాస్తున్నదిఆపి తలెత్తి ఆమెను చూస్తాడు.

ఆమె చూస్తున్నప్పుడు అతను చూడడు. అతను చూస్తున్నప్పుడు ఆమెచూడదు. ఒకరు చూసిన తర్వాత మరొకరు చూస్తుంటారు. అలాఒక్కనిమిషం చూసి మళ్ళీ [illegible] వాళ్ళు మునిగి పోతుంటారు.

ఆమె ఎందు కతన్ని చూడాలి ?

అతను ఎందు కామెను చూడాలి ?

జవాబురాని ప్రశ్నలివి. ఒకళ్ళనొకళ్ళు ప్రేమించుకొంటున్నామని వాళ్ళెప్పుడూ అనుకోలేదు. అసలు ఆ [illegible] వాళ్ళెప్పుడూ ఆలోచించినట్టులేదు. ఎప్పుడయినా ఆమె అతని దగ్గరకొచ్చి 'నిన్ను నేను ప్రేమిస్తున్నా' నని అన్నా, అతనూ ఆమెదగ్గరకు వెళ్ళి అలానే అన్నా అది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఆశ్చర్యమూ కలుగుతుంది.

అయితే ఆమె ఒకవేళ కడవెత్తుకొని [illegible]కాలు జారి పడిపోతే అతను పరుగెత్తుకెళ్ళి ఆమెను లేవ[illegible]

తెలుగు విశ్వవిద్యాలయము గ్రంథాలయము

వరకూ దిగబెట్టిరావడానికి వెనుదీయడు. ఆమెకూడా అంతే. ఎప్పుడన్నా అతను ఆగట్టున ముఖంతిరిగి పడిపోతే, ఆచుట్టూ అతని ముఖంమీద యిన్నిచన్నీళ్ళు చల్లేవాళ్ళు లేకపోతే ఆమె ఫర్లాంగుదూరం గట్టుమీద పరుగెత్తి బల్లకట్టుమీద యీవలిగట్టుకొచ్చి, అతనికి తెలివి వచ్చేంత పర్యంతమూ ప్రక్కనే కూర్చుని సాయంచెయ్యడానికి వెనుకంజ వెయ్యదు.

అంతగాకపోయినా కొంచెం చిన్నదయినా ఆమె కాలికి ముల్లుగుచ్చుకొంటే, అది అతను చూస్తే 'అయ్యో' అనుకుంటాడు. ఆమె, అతను నడుస్తూ రాయి తగిలి తూలిపోతే, అది ఆమె చూస్తే "అమ్మో" అనుకుంటుంది.

ఆమె అతనికి, అతను ఆమెకు ఎప్పుడూ సహాయంచేసుకోలేదు. కాని ఎప్పుడన్నా ఆమె అతని దగ్గరకొచ్చి యీపడవ చూస్తుండమని అన్నా, అతను ఆమెను పిలిచి కాస్తా ఆవలి వడ్డుకు చేర్చమని అన్నా వీల్లేదని వాళ్ళెప్పుడూ తప్పించుకోలేరు. తప్పకుండా ఒకరి కొకరు సాయం చేసుకుంటారు. కాని అలాంటి అవసరం వాళ్ళకు ఎప్పుడూ కలగలేదు.

అయితే అలా ఒకరినొకరు చూసుకోవడంలో అర్థం ఏమిటి?

... ... ... ... ...

అతనురోజూ అక్కడ ఆమెనుచూస్తాడు. ఆమె అతన్నిచూస్తుంది. అతనురానిరోజు ఏదో ఆమెకు తెలుసు. ధారాపాతంగ వర్షంపడి నేల బురదబురదగ ఉంటే అతను ఆరోజున రాడు. ఆమె ఆసమయంలో నీళ్ళకు వచ్చినా ఆగట్టు వయిపుచూడదు. అతను రాలేదని ఆమె మనసు బాధపడదు. ఆమెను చూడలేక

పోయానే అని అతను బాధపడడు. ఒకవేళ బాధపడినా అది ఒకక్షణంసేపుమాత్రమే వాళ్ళమనసుల్ని నొప్పించిపోతుంది. అంతే! మళ్ళీ అతను అతనే! ఆమెఆమే! ఒకర్ని గురించి ఒకరు ఆలోచించుకోరు. ఒకనెలరోజులు వరుసగా వర్షాలు వచ్చి యిరువురూ ఒకరినొకరు చూసుకోక పోయినా పెద్దగా ఎవరూ బాధపడరు. విధివశాన వాళ్ళిరువురూ శాశ్వతంగా దూర మయిపోయినా వాళ్ళ హృదయాల్లో పెద్దసంచలనం ఏమీ ఉండదు. సామాన్యంగ యితరులు చూపించేవిధంగా వాళ్ళు ఒకరికొకరు సానుభూతి చూపించుకొని మళ్ళీ మర్చిపోతారు. నెలలు, సంవత్సరాలు కాలవాహినిలో కరిగి వాళ్ళిద్దరిమధ్యా కొన్నేళ్ళ చరిత్రల్ని సృష్టించినా వాళ్ళమధ్య అంతకన్నా ఎక్కువ సన్నిహితత్వం ఏర్పడదు.

ఏడాది గడచినా వాళ్ళమధ్య ప్రారంభంలోఉండే పరిచ యంకన్నా – అధికం కనుపించలేదు. ఒకరోజు అతను గట్టు మీదికొచ్చి కూర్చున్నాడు. గట్టుకింద నీళ్ళల్లో కడవముంచి ఆమె అతన్ని చూసింది.

అతడి ముఖంలో బుగ్గమీద చింతపిక్కంత కాటుకమచ్చ, కొత్త బట్టలు, వాటిమీద అక్కడక్కడ పసుపు చారలు, ప్రక్కనే క్రొత్తచెప్పులు చూసి తలదించుకొని కడవభుజాన్ని వేసుకొని వెళ్ళిపోయింది.

ఆరూపంలో అతను కనుపించాడని ఆమె ఆశ్చర్యపోలేదు. గంటలకొలది అతన్ని చూస్తూ నుంచుండిపోలేదు. అంతకు ముందు రోజూ అతన్ని ఎంతసేపు చూసేదో. యిప్పుడూ అంతే

సేపు చూసి యింటికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోతున్నప్పుడు కాళ్ళక్రిందరాళ్ళు నీళ్ళల్లోకి జారిపడి మెల్లగ శబ్దం చేసాయి. అతను తలఎత్తి వెళ్ళిపోతున్న ఆమెను ఒక్క నిమిషంసేపు చూసి దృష్టిమరల్చుకున్నాడు.

ఆతర్వాత వారం రోజులవరకు అతను అటు వయిపురాలేదు. అతను రాలేదని ఆమె దిగులుపడి కళ్ళు కాయలు చేసుకొని చూస్తూ కూర్చోలేదు. అతను జీవితంలోని ఆనందాన్ని, జీవితాంతము అంటిపెట్టుకొనే సహచరిణిని పొందబోతున్నాడని ఆమెకు తెలుసు. మామూలుగా అందరిలానే ఆమెకూడా ఒక్క నిశ్వాసాన్ని విడిచింది. ఒకచిరునవ్వు నవ్వింది.

అతను భార్యను వెంటబెట్టుకొని షికారుకు వచ్చాడు. గట్టువెంట నడుచుకొంటూ యిరువురూ బయలుదేరారు.

నీళ్ళకొస్తూ ఆమె వారిని చూసింది. జంటగ ముసిముసి నవ్వులు నవ్వుకొంటూ పోతున్నారు. అతను భార్యచేతుల్ని తనచేతుల్లోకి తీసుకొని, చుట్టూ ఎవరూ లేరనుకొని ఆమె చుబుకాన్ని చిటికినవ్రేలుతో మీటి, ఆమెముఖంలో ముఖం పెట్టి నవ్వుతూ భార్యతో అలా గట్టువెంబడే చాలా దూరం వెళ్ళిపోయాడు. అలావెళ్ళి చాలా పొద్దలాడే వెనక్కు మరలి పోయారు. ఆ పాకలో ఎప్పుడూ చూడనంత వేగంగా దీపం వెలిగించి ఉంది. ఆ దీపం వెలుతురు కాలవనీళ్ళల్లో పడి మెరుస్తోంది.

తర్వాత రోజున మామూలుగా రోజూవలెనే అతను వచ్చి అక్కడే కూర్చొని, ఏదో వ్రాసుకొని, నీళ్ళకు

వచ్చినప్పుడు ఆమెనుచూసి, ఆమె దీపం వెలిగించగానే వెళ్ళి పోయాడు. ఆమెకూడా నీళ్ళను ఎత్తుకొని వెళ్ళిపోతున్నప్పుడు వెనక్కు తిరిగి అతన్ని చూసింది.

అతను చూస్తున్నాడు.

ఆమె చూస్తోంది.

ఎండిన కాలవలో నీళ్ళుచేరుకొంటున్నాయి. కొద్దికొద్దిగ వర్షం నీటిని నింపుకొంటూ గట్లను రాసుకొంటూ కాలవ ప్రవహిస్తోంది. అలాప్రవహించి తిరిగి ఎండలు రాగానే జీర్ణించి పోయినదానిలా ఎండిపోయింది. ఎండలు నీటినిహరించి ఆవిరిగా పైకిలాక్కు పోతున్నాయి. అంతవరకు ఆమెను అలానే అతను, అతడిని అలానే ఆమె చూస్తూనే ఉన్నారు.

ఒకనాడు ఆయింటిముందు చిన్నపందిరి మొలిచింది. ఆపందిరికింద ఆమె కూర్చొని ఉంది. చుట్టూ ముత్తయిదువలుచేరి ఆమెను పీటలమీాద కూర్చోబెట్టి పాటలు పాడుతున్నారు. సన్నాయిమేళాలు, బాజాభజంత్రీలు మ్రోగుతున్నాయి. ఆడాళ్ళు కంగారుగా నీళ్ళను కడవలతో కాలవనుండి యింటికి మోసుకెళ్తున్నారు. సన్నగా సంజచీకట్లు వ్యాపించాయి. పందిరిలో, పాకలో పెట్రొమాక్సుదీపాలు వెలుగుతున్నాయి. ఆప్రదేశమంతా పట్టపగలులా జిగేల్‌మంటొంది. కాలవనీళ్ళన్నీ వెండిలా తళతళలాడుతున్నాయి. అతనులేచి తేలిగ్గా నవ్వి వెళ్ళిపోయాడు.

'ఆమె కొత్తజీవితంలోకి ప్రవేశిస్తోంది. భవిష్యత్తును ఒకపురుషుడిచేతుల్లో ఉంచి అతన్ని అంటిపెట్టుకొని, అతనికి

ఆనందాన్నియిస్తూ తను కోడల్ని తల్లిని, అమ్మమ్మను కావాలని కోరుతోంది. అతన్ని కనిపెట్టుకొని, అతనికి కావలసినవి సమకూరుస్తూ కష్టసుఖాల్ని భర్తతోపాటు తనూ సమానంగా పంచుకుందామని పూనుకొంటోంది. సంఘము, కులము అనే నియమాలకు కట్టుబడి వ్రేలెత్తిచూపించేందుకు వీలులేకుండా వాళ్ళు నిర్ణయించిన దాన్ని ఆప్యాయంగ, భర్తగ, దేవుడిగ, తన సర్వస్వము అతనిగ భావించి అగ్నిముందు అతనిచేత శాశ్వత బంధాన్ని తగిలించుకొంటోంది. ఆమె ఆదర్శ స్త్రీ'

అతను సంతోషంతో ఊపిరితీసి లేచినుంచొని వెళ్ళిపోదామని మెల్లగ బయలుదేరాడు.

పందిరిలో ఆమె ముందు వెలుగుతున్న మంటలు అతను గట్టుమీద తిరిగి వెళ్ళిపోయేవరకూ వెలుతుర్ని యిస్తూనే ఉన్నాయి. ఆబాజాలు యింటినిచేరి అర్ధాంగి పలకరించేవరకు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

ఆ మరుచటిరోజు ఆమెను చూశాడు. కాలవగట్టున నడుస్తోంది. కళ్ళకు నిన్నటి కాటుక, ముఖానికి పసుపు, యింకా అంటిపెట్టుకొనే ఉన్నాయి. ఆ తలమీది తలంబ్రాలు, మెళ్లో ఓ క్రొత్తటిహారం, నలగక నిగనిగలాడుతూన్న ఎర్రని పట్టుచీరె, మోచేతివరకు నిండుగ అందంగా వేయించుకొన్న గాజులు, చెవులకు బంగారు పోగులు, మోకాటి క్రిందవరకు వేలాడే జడ — ఆ చివర చిన్న శబ్దం చేస్తూ ఊగులాడే జడ గంటల్లో పెళ్ళికూతురి పచ్చదనంపోకుండానే నీళ్ళకు వచ్చింది!

చీకటిపడి ఎదుటి కొండల్లోంచి చంద్రుడు పైకి వచ్చి

నక్షత్రాలు మెరిసేముందు గట్టున యింట్లో దీపం వెలిసింది. లేచి నుంచొని యింటివైపు బయలుదేరాడు. కాలవకు ఆవలి వైపున ఎవరో చెట్ల నీడల్లో, మసక వెల్తుర్లో కూర్చొని కబుర్లు చెప్పుకొంటున్నారు. ఒకస్త్రీ ఏమిటో అంటోంది దేన్నో చూపించి. ఆస్త్రీ ఎవరో అతనికి తెలుసు. ఆ గాజులశబ్దం ఆమెదే!

అతను గట్టుదిగి క్రిందనుండి నడుస్తున్నాడు. గట్టును, గలగల్లాడే నీళ్ళను, కీచురాళ్ళ శబ్దాన్ని దాటి కిలకిలమని పక్షుల్లా, స్వేచ్ఛగా వచ్చని చేలల్లో హాయిగా ఎగిరే పిట్టల్లా, నవ్వులు వినిపిస్తున్నాయి. అవి వింటూనే యింటికి వెళ్ళిపోయాడు.

ఆమె రేపు వెళ్ళిపోతుందనే సంగతి అతనికి తెలుసు. ఆమెకు జీవితంలో ఏది శరణ్యమో ఆ అత్తారింటికి భర్తతో వెళ్ళిపోతుంది. పూర్వంలా ఆ కాలవ, నీళ్ళు, పాక, దీపం అతనితో సంబంధంలేకుండా పోతాయి. అతనికి తెలీకుండానే అతని మనసులో బలహీనత ప్రవేశించింది. అత్తారింటికి వెళ్ళిపోయే క్రొత్తపెళ్ళికూతుర్ని చూస్తుంటే ఆమెకు ఏమీ కాకపోయినా, ఆమెను అంతకు ముందు ఎరుగకపోయినా చూసేవాళ్ళ కళ్ళు చెమర్చే విధంగానే అతనూ ఆమె వెళ్ళిపోతుందంటే క్షణంసేపు బాధపడ్డాడు. కాని అట్టేసేపు ఆమె ఆలోచన అతన్ని అంటిపెట్టుకోలేదు.

ఆ తర్వాత అతను కాలువగట్టున కూర్చున్నప్పుడు కాలవ నీళ్ళల్లో బుడబుడశబ్దం వస్తూంటే అలవాటు ప్రకారం తలెత్తి చూశాడు. ఏభై ఏళ్ళ ముసలమ్మ కడవెత్తుకుని వెళ్ళిపోతోంది. ఆవిడను అప్పుడప్పుడు ఆ పరిసరాల్లో చూస్తుండేవాడు.

తరచుగా అయింట్లో కనుపిస్తుండేదికూడా. బహుశా ఆమె తల్లిగాబోలు అనుకున్నాడు. కాని అలా చూసే అలవాటు క్రమంగా పోయింది. అతను వ్రాసినంతసేపు తల దించి వ్రాయడం, లేక ఎటో శూన్యంలోకి చూస్తూ ఉండడం; చీకటిపడినట్టు ఎప్పుడు గుర్తించగలిగితే అప్పుడు యింటికి వెళ్ళిపోవడం అతను క్రొత్తగా ఏర్పరచుకొన్న అలవాట్లు.

కాలం పరుగెడుతోంది. అయినా అలవాటుమారలేదు. కాలంతోపాటు మనుషుల చరిత్రలూ పెరుగుతున్నాయి. ఒక్కొక్కరి జీవితంలోనూ వాళ్ళు మోయలేనంత బరువు చరిత్ర పుటలగ్రంథాలు ఏర్పడుతున్నాయి. అవన్నీ వాళ్ళస్వీయ చరిత్రలె అయినా అందరికీ అన్నీ జ్ఞాపకం ఉండవు. క్రొత్తవి వస్తున్నకొలది పాతవి మర్చిపోతుంటారు. ఒకప్పుడు అతిముఖ్యమైన విషయం, జీవితంలో ఎంతో విలువైనది చటుక్కున మరుపు తెరలోనికి వెళ్ళిపోతుంటుంది. మళ్ళీ ఎప్పుడయిన ఆ విషయాల్ని వ్యక్తం చేసే సంఘటనలు ఎదురయిననాడు ఆనాటివన్నీ జ్ఞాపకానికొస్తాయి. ఇంతసేపూ నాటిగురించి ఆలోచించనైనా ఆలోచించరు. కాలంలోని విచిత్రం యిది! ఇది మనుషులను చూస్తుండగనె మార్చివేస్తుంది. కాలానికి కాలానికిమధ్య అఘాధాల అంతర్యం ఉంది. ఓడల్ని బళ్ళుగ బళ్ళనిఓడలుగమార్చివేస్తుంది. ఒకనాడు మహాసామ్రాజ్యాల్ని ఏలిన ప్రభువులు దరిద్రనారాయణులై దేశాలవెంట తిరుగుతుంటారు. వీధుల్లో అడుక్కుతినే అన్నార్తులు సంపన్నులై కాలుమీద కాలువేసుకొని భోగభాగ్యాలతో తులతూగు

తుంటారు. అలా జరగడానికి అట్టేకాలం అక్కరలేదు. అంత తక్కువ సమయంలో సహస్రాల తేడాను సృష్టిస్తుంది.

అతను పెళ్ళిచేసుకున్ననాడు అంత వేగంగా తన అర్థాంగి విడిచిపోతుందనుకోలేదు. తను బ్రతికినంతకాలమూ ఆమె జీవిస్తుందని, తన అనంతరము ఆమెకూడా తనలో కలిసిపోతుందని, ఆమె ఆప్యాయంగా ప్రేమగా కవ్వించి నవ్విస్తుందని తలంచాడు. అతని వంశానికి బాలుని అప్పగించి, ఆ బాబుద్వారా వంశాన్ని నిలబెట్టేభారాన్ని అతనిమీద ఉంచి బాబు ఆటల్నీ పాటల్నీ చూడకుండ, ఆ బాబు ఏడుస్తే హృదయానికి తీసుకొని రొమ్మును పెదాలకందించి కన్నతల్లి సంతోషాన్ని పొందకుండానే పురిటిలోనే కన్ను మూసింది!

అతను ఊహించుకొన్న ఊహల్లో వందోవంతు నిజం కాకుండానే, ఇంకా అనుభవించాల్సిన కాలం ఎంతో మిగిలి ఉండగనే అదృష్టహీనురాలై అతడిని దురదృష్టానికి దాసుడిని చేసి, అతన్ని మనసార చిఱునవ్వునవ్వే యోగ్యతలేకుండా చేసి వెళ్ళిపోయింది. ఏకాంత మయిన అతని జీవితానికి ఒక పసికందుమాత్రమే మిగిలింది.

భర్తభారాన్ని సగం భరిస్తుండేభార్య తను చనిపోతూ ఆ సగంబరువునూ భర్తకే వదిలి, కూడా మరోపసికుర్రాడి పోషణాన్ని అంటగట్టి నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయింది. ఆమె కళ్ళు మూసేముందు ఆ కళ్ళల్లో వెలుగు, యింకా బ్రతకాలనే ఆశ, అతడిని ఒక్కడిని చేసిపోతున్నానన్న దుఃఖము అతను చూసినప్పుడు గుండెపగిలినట్టు ఏడ్చాడు. "ఇంత నిర్దయఏమిటి ప్రభూ" అంటూ కళ్ళనీళ్ళు రాల్చుకొంటూ విలపించాడు.

రోజూ అదే ఆలోచన. గట్టున కూర్చొని జీవితంలో ఆమెతో ఆనందంగా గడిపిన బహుకొద్ది రోజుల్ని పదేపదే తలంచుకుంటూ మర్చిపోయిన వాటిని పునఃశ్చరణ చేసుకొంటుండేవాడు. భార్యపోయిన చాలాకాలం వరకు అలానే యింకో పనేమీ చెయ్యకుండ జీవితాన్ని తిరగేస్తూ కూర్చొనేవాడు. గతాన్ని మర్చిపోవాలనుకున్నా అందు కతను శక్తుడు కూడా కాదు. ఒక్కొక్కప్పుడు కాగితాల్ని వెంటబెట్టుకొని కాలవగట్టున కూర్చొని వ్రాసుకొందామని వెళ్ళినా కలం నడిచేదిగాదు. వాటిని ప్రక్కనే వదలి కొంచెం మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఏదో వ్రాస్తూ ఉండేవాడు. అలానే కావ్యాల్ని అల్లేవాడు. కథల్ని సృష్టించేవాడు.

ఎంతవిచిత్రమైనది కాలం! ఒకవసంతం గడవగనే ఆమెను పూర్తిగా మర్చిపోయాడు. ఎప్పుడన్నా ఆమె ఆలోచనవచ్చినప్పుడు భారంగానిట్టూర్చి అంతటితో దాన్ని వదిలివేస్తుండేవాడు.

ఒక రోజు అతని వెనుక నీళ్ళశబ్దం వినిపించింది. వెనక్కు తిరిగిచూడలేదు. ఆకాశంవైపు తిరిగి ఆలోచిస్తున్నవాడు అలానే ఆలోచిస్తూ ఉండిపోయాడు. మళ్ళీ వెనుకనుండి సన్నగా ఏడుస్తున్న పసిపాప కంఠం వినిపించింది. వెనక్కు తిరిగాడు.

ఆమె!

ఆమె చంకలో చిన్నపసిపాప! అతను ఆశ్చర్యంగా నిదానించి చూశాడు. నవ్వుతూ నీళ్ళనుచూసి కేరింతాలుకొడుతూ ఆడుకొంటున్న పాప. అచ్చంగా అవేకళ్ళు, ముక్కు, మొగం – అంతా ఆమెపోలికే!

కాని 'ఆమె' మొఖంలో చిరునవ్వు, పూర్వం ఉత్సాహంలేవు. ఆమె చూపుల్లో దైన్యం, నిరాశ అలముకొన్నాయి. జీవితంమీద విరక్తి ప్రత్యక్షంగా ఆమెలో అగుపిస్తోంది. ఆనాటి నిండుతనం, సౌందర్యం – ఏవీ ఆమెలో కనుపించడంలేదు. ఏదో ఆమెలో లోటుగాఉంది!

ఆమె సౌభాగ్యానికి సంతోషానికి కారణమైనది, తనిజీవితాంతము అదేశరణ్యమని నమ్ముకున్నది, తన ఆశల్ని నిరాశలు చేసి జీవితాన్ని వ్యర్థం చేసినది – ఆ నుదుటి సింధూర తిలకం ఆమెలో కనుపించడం లేదు. తన అందాన్ని సౌందర్యాన్ని అతనిగురించే నని, అతన్ని నవ్విస్తూ తను నవ్వాలని, అతని భారాన్ని సగంమోద్దామని, అతని ఆదరాన్ని ప్రేమను పొందాలని కలలుగని కలల్లో వాస్తవాని కతీతమైన అనుభూతుల్ని పొంది, మేఘాల్ని దాటి రోదసీకుహరం వరకు చొచ్చుకుపోయే ఊహాసౌధాల్ని సృష్టించి అవే నిజమని వెర్రిభ్రమతో ఎదురుచూస్తుండగ ఒక్కసారిగ ఊహించిన ఊహాసౌధాలు, కన్న కలలు కూలి మట్టిలోగలిసిపోయాయి! ఆమె మాంగల్యం మంటగలిసింది!

ఆర్నెల్ల పనిపిల్ల ముద్దు ముచ్చటలు తీర్చకుండానే, ప్రేమగా నాన్నా అని పిలిపించుకోకుండానే ఒక్కదాన్నీ పిల్లను విడిచి, ఏడుస్తున్నప్పుడు జాలిగా ఆమె కళ్ళల్లోకిచూస్తూకన్నీళ్ళువదిలి, భార్యచేతిలో చిల్లుగవ్వయినా మిగల్చకుండ నిస్సహాయురాలుని చేసిపోతునానన్న బాధతోనే నిట్టూర్చి కళ్ళుమూశాడు అతను.

ఆమె చంకన జారుతున్న పాపను సరిగాతీసుకొని, మరో

సానుభూతిని చూపించి, క్రిందబడిన కలాన్ని తీసి ధూళిదులిపి కథ వ్రాయడంలో మునిగిపోయాడు.

అతని ముఖంలోని నిరాశ, నిస్పృహాల్ని ఆమె చూసింది. జీవంలేని అతని చూపులు ఏవో చరిత్రల్ని చెప్తున్నాయి. మనిషిలోను, అలవాట్లలోను వచ్చిన మార్పు క్రమంగా ఆమె గమనించింది. ఒక్కొక్కప్పుడు కలాన్ని కాగితాన్ని ప్రక్కనఉంచి ఆకాశంవంక తదేకంగా చూస్తుంటాడు. గడ్డం బాగా పెరిగిపోయినా, బట్టలు నల్లగా మాసిపోయినా వాటిని సంస్కరిద్దామనుకోడు. కూడా రెండేళ్ళపసికుర్రాడిని వెంటబెట్టుకొని వస్తాడు. ఉన్నట్టుండి ఆకుర్రాడిని హృదయానికి గాఢంగా హత్తుకొని చెక్కిళ్ళను ముద్దెట్టుకొని ఆకళ్ళల్లోనికి నిదానించి చూసి నిట్టూర్పు విడుస్తాడు.

అందుకు కారణం ఆమె ఊహించుకొంది. "అతని ఆశాజ్యోతి ఆరిపోయిఉంటుంది. అతని హృదయరాణి చేతిలోనుండి దాటిపోయింది గాబోలు. జీవితంలో పెద్ద అగాధం అతని కళ్ళముందు ఏర్పడి ఉండాలి. ఈ హఠాత్సంఘటనలు మనిషిని కుదించివేసాయి. ఆకారం మారిపోయింది. అలవాట్లు క్రమం తప్పాయి."

అయినా అతను ఆమెను ఆమె అతన్ని చూసుకొనే అలవాటు మారలేదు. అతను చూస్తున్నాడు. ఆమె చూస్తోంది. కాని అతను ఆమె ఒక్కదాన్ని, ఆమె అతడి ఒక్కడినికాదు చూడడం.!

ఆమెచంకన ఏడాదిపాప; అతని ఒడిలో రెండేళ్ళబాబు!

ఆమెకూడా రెండేళ్ళపాప ; అతని ప్రక్కన మూడేళ్ళ బాబు !

ఆమె వెంట ఏడేళ్ళ పాప ; అతనిదగ్గర్లో ఎనిమిదేళ్ళ బాబు ! తల్లివెంట తనూవచ్చి చిన్నకడవను మోసుకెళ్తున్నపాప ; తండ్రివెంట తనూవచ్చి ఆప్రక్కనే ఆడుకొంటుండే బాబు !

ఆమెరాకపోయినా పాపనీళ్ళకు వస్తుంది. అతనురాక పోయినా బాబు ఆడుకోడానికి వస్తాడు.

పాపబాబునిచూసింది. బాబు పాపనుచూనాడు.

ఆమె యింటిముందు నాటిన రావిచెట్టు అతనురోజూ చూస్తుండగనే పెరిగి పెద్దదై కాలవనీళ్ళల్లోకి, యివతలిగట్టు మీాదకు వంగుతోంది. ఆకులు కుష్కించి పట్టుతప్పి కాలవలో పడిపోతుంటే దానిస్థానంలో క్రొత్తవి మొలుచుకొస్తు న్నాయి. కాలవ అనేకసార్లు ఎండలకు ఎండి మళ్ళీ వర్షాకా లంలో నీళ్ళతో నింపుకొంటోంది. క్రొత్తగా అనేక మొక్కలు, యిళ్ళు ఆచుట్టుప్రక్కల మొలుచుకొస్తున్నాయి. ఆచుట్టూ క్రొత్తక్రొత్త మనుషులు వసుస్తు ఎప్పుడూ కనుపించని వాళ్ళు — పిన్నలు, పెద్దలు కనుపిస్తున్నారు. మనుషులుమారి అలవాట్లు మూలపడుతున్నాయి.

అతను అంతదూరం నడిచి రాలేక యింట్లోనే కూర్చుండి పోయాడు. ఆమె అంతబరువు కడవ ఎత్తుకోలేక నీళ్ళకు కూతుర్ని పంపిస్తుండేది. అతనితలలో తెల్ల వెండ్రుకలు మొలి చాయి. వంటినిండా ముడతలు, శరీరంలో నీరసం వ్యాపిం చాయి. పండినఆకులు రాలిపోతున్నట్టుగా ఒక్కొక్క పన్నే రాలిపోతోంది. చూపుసరిగాఉండాలని సులోచానాల్ని వాడు

తున్నాడు. తూలిపోకుండా ఉండామని చేతికర్రను జత చేర్చాడు. ఆచుట్టుప్రక్కల యిళ్ళల్లో చిన్నపిల్లలు రోజూ సాయంకాలం "తాతా కథచెప్పవూ" అని ఆతనిచుట్టూ చేరుతున్నారు. చీకటిపడేవరకు అతను వారికి కథలు చెప్పి పంపిస్తుంటాడు. అంతలోనే బాబువస్తుంటాడు.

"ఏం రఘూ. యింతఆలస్యం?" అని ఎప్పుడన్నా అతను అంటే "అబ్బే ఏంలేదూ షికారుకు వెళ్ళివచ్చాను" అంటాడు బాబు.

రఘు ఎక్కడకు షికారుకువెళ్ళింది అతనికి తెలుసు. ఎందు కంత ఆలస్యంఅయిందీ కూడా అతనికి తెలియకపోదు. ఆజవాబు విని యింకేమీ మాట్లాడడు. ఓమారు అక్కడి కాలవగట్టు జ్ఞాపకానికొస్తుంది. అది జ్ఞాపకానికొచ్చినప్పుడే ఆశ్చర్యంగా తనశరీరంవంక చూసుకొని వెలికిగా నవ్వుకొంటాడు.

"ఆమెకూడా యిలానే తయారయి ఉంటుంది!"

సరిగ్గా అలానే తయారయింది! మనిషి నిలువునా నీరసించి యీనెపుల్లలా ఉంది. నీళ్ళకడవ ఎత్తుకొనే శక్తికూడాలేదు. ఒక్కొక్కటే తెల్లని వెంట్రుకలు తలలో మొలుచుకొస్తు న్నాయి. పళ్ళు ఊడకపోయినా గట్టిగాలాగితే జలజలా రాలి పోయేటట్టుగా పట్టుతప్పి ఉన్నాయి. చీకటిపడితే కళ్ళు కని పించడంలేదు. ఎక్కడకు వెళ్ళడానికి ఓపికలేక యింటిదగ్గరే పడి ఉంటుంది. పాపనీళ్ళు తెచ్చి వంటచేసి తల్లికింత పెడ్తుంది.

"కాస్త వేగిరంరావే లక్ష్మీ" అంటుంది ఆమె పాప్యం నీళ్ళకు పంపిస్తూ. అలా అనకపోతే లక్ష్మి ఎంతఆలస్యం

చేస్తుందో ఆమెకు తెలుసు. ఎందుకంత ఆలస్యం చేస్తుందో గూడా ఆమెకు తెలియకపోదు. అలాఅంటూ ఓమారు పాత్రి కేళ్ళ వెనక్కు పరుగెత్తి నీరసంగా నవ్వుకొంటుంది.

ఆనవ్వు అర్థంగాక ఆశ్చర్యంగా ఆమెకేసి చూస్తూ "యిప్పుడే వస్తా" నని వెళ్ళిపోతుందిలక్ష్మి. కాని అనుకున్నంత వేగంగ మనస్సు వెనక్కు వెళ్ళనివ్వదు. ఆగట్టున రఘు చదువుకొంటూ తననుచూసి దగ్గరకు రమ్మని సైగచేస్తాడు. ఆతనితో మాట్లాడందే వెనక్కు మరలలేదు. పరుగెత్తుకెళ్ళి బల్లకట్టు మీద కాలవదాటి అతని బడిలోకొచ్చి వ్రాలుతుంది. నిమిషాలు, గంటలు మనసులు అల్లిబిల్లిగ పెనవేసుకొంటాయి.

అంతసేపు నవ్వుతూ, చిలిపిగాచూస్తూ, అరుస్తూ ఎన్నో విషయాలు మాట్లాడుకొంటారు. కాలవగట్టున ఒకర్నొకరు తరుముకొంటూ పక్షుల్లా పరుగెత్తిపోతుంటారు. గట్టున కట్టిన పడవల్ని విప్పి నీళ్ళల్లోకిత్రోసి ఆ నీళ్ళల్లో కాళ్ళను ఆడిస్తూ చిలిపిగ పిల్లలమాదిరి నీళ్ళను మీదకుచల్లు కుంటారు. నలుగురూ ఏమనుకుంటారో అన్న భయం లేదు. 'మా ప్రేమకు మడి కట్టి మూల కూర్చోబెట్ట మంటారా ?' అంటారు వాళ్లు. ఇరువురూ చీకటిపడేవరకు గట్ల వెంబడి తిరిగి కూనిరాగాలు తీస్తూ ఎవరిళ్ళకువాళ్ళు చేరుకొంటారు.

ఒకరోజు అతను రఘును పిలచి "నీకు పెళ్ళి చేయాలను కుంటున్నాను రఘూ" అన్నాడు. రఘు జవాబుగా 'ఊ' అని మాత్రం ఊరుకున్నాడు. ఆ సాయంకాలం తండ్రిని కూడా వెంటబెట్టుకొని కాలవగట్టుకొచ్చాడు. ఇద్దరూ కూర్చొని



మాట్లాడుకొంటుండగ లక్ష్మి నీళ్ళకువచ్చి వాళ్ళిద్దర్ని చూసి కొద్దిసేపు అలానే నిలబడిపోయింది. ఆతర్వాత జ్ఞాపకంవచ్చి గబుక్కున నీళ్ళకడవను తీసుకొని యింటికి వెళ్ళిపోయింది.

రఘు వెళ్ళిపోతున్న లక్ష్మిని చూపించి "ఆమెను చూశావు కదు నాన్నా. ఎలాఉందంటావ్ ?" అన్నాడు. అతను తల ఆడించి "బాగానే ఉంది" అన్నాడు.

రఘు ఆశగ తండ్రిముఖంలోకి చూశాడు. "అదే నాన్నా. అ అమ్మాయినే పెళ్ళాడా లనుకుంటున్నాను. ఆమెకూడా వప్పుకొంది. ఏమంటావ్ ?" అని తండ్రి ముఖంలోకి చూశాడు.

అతను చాలా గంభీరంగా నుంచొని కదిలే కాలవ నీళ్ళను, ఎత్తైన ఏటవాలు కాలవగట్లను, గట్టున చెట్లల్లో నుండి తొంగి చూసే తాటాకుపాకను, ఆముందు నుంచొని కూతురు ఏదో చెప్తుండగ తమను చూస్తున్న ఆమెను, తనప్రక్క ఆశగా కళ్ళల్లో వత్తులుంచుకొన్న రఘును చూసి క్షణంసేపు కళ్ళు మూసి ఆలోచించి తేలికగా గాలి పీల్చి వదిలిపెడుతూ చిరునవ్వు నవ్వాడు.

"లక్ష్మీ" అన్నాడు హుషారులో రఘు. లక్ష్మి వచ్చి నుంచొంది. ఆమెకూడా లక్ష్మివెంట వచ్చి యీవలిగట్టున నుంచున్న అతడిని చూస్తూ నిలబడింది. అతను నాలుగడుగులు ముందుకువేసి గట్టు చివరవరకు వచ్చి నుంచున్నాడు.

రఘు గట్టున కట్టిన పడవను విప్పి కూర్చొని నీళ్ళల్లోకి వదిలాడు. లక్ష్మి గొంతవరకు నీళ్ళల్లో మునిగి అతడిని చేరుకొంది. రఘు తెడ్డును పట్టి నడుపుతూండగా లక్ష్మి చుక్కా-

నను చేతిలోకి తీసుకొంది. ఇరువురు కాలవలో వాలుగా గుబురుగా మీదవాలుతున్న చెట్లకొమ్మల్ని తప్పించుకొంటూ చల్ల గాలుల్ని పీల్చుకొంటూ వెళ్ళిపోయారు.

తిరిగివచ్చేసరికి గట్టుమీద అతను, ఆమె కలిసి కూర్చున్నారు. వాళ్ళు రాగానే రఘుతో కలిసి అతను వెళ్ళిపోయాడు. లక్ష్మమ్మ చెయ్యి ఊతతీసుకొని ఆమె వెళ్ళిపోయింది. చంద్రుడు వాళ్ళ మధ్యకొచ్చి చూస్తూ కదలిపోయాడు.

అప్పటికి చాలా కొద్దిరోజుల్లోనే ఆ గట్టంతా పెళ్ళి బాజాలతో ప్రతిధ్వనించింది. ఆ కాలవనీళ్ళల్లో పెళ్ళి పారాణి పాదాలు ప్రక్షాళనం చేసుకున్నాయి. అర్ధరాత్రి వెన్నెల్లో కాలువగట్లమీద, పడవలమీద లక్ష్మమ్మ రఘులు కూర్చొని కథలు చెప్పుకొంటుండేవారు. రఘు కల్పించి క్రొత్త క్రొత్త సంఘటనల్ని జతచేర్చి ఒకరోజు చెప్పవలసిన కథను నెలరోజులు చెప్పేవాడు. రఘు చెప్పిన పన్నెండు కథలు ఆమె చాలా ఓపిగ్గా వింది. ఆ తర్వాత ఆమెకు ఆ కథలు వినేతీరిక లేకపోయింది. అంతవరకు తను నేర్చుకున్న కథలన్నీ తన మూడునెలల చంటికి చెప్పేందుకై మాటలు నేర్పుతూ కూర్చుండేది.

ఆమె నేర్పిన మాటల పర్యవసానంగా చంటి మొట్టమొదటిసారిగ 'అమ్మమ్మ' అన్నాడు. అది విని ఉప్పొంగిపోయే అదృష్టం ఆ అమ్మమ్మకు లేకపోయింది. కోడలు, తల్లి, అమ్మమ్మ కావాలనుకునే ఆమె కోరిక పూర్తిగా నెరవేరకుండానే ఆమె కళ్ళుమూసింది.

* * *

తను తాతయ్య నయ్యా నన్న సంతోషంతో అతను లేని ఓపిక తెచ్చుకొని కాలవగట్టు కెళ్ళాడు. ఆ పరిసరాల్ని చూస్తూంటే గతమంతా జ్ఞాపకం వచ్చింది. ఓమారు అతని వళ్ళు జలదరించింది. వెనక్కు మరలి నోట్లో గొణుక్కున్నాడు.

"ఆమె పండి రాలిపోయింది. ఇక మిగిలిందల్లా తను!"

తాని హృదయం మెల్లగా నవ్వింది.

"తను తాతయ్య అయ్యాడు!"